క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తాడూర్: మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాల అసిస్టెంట్ కుక్ పోస్ట్ భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు పై బడిన వారు 7వ తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల11లోగా దరఖాస్తులను ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

టేకు చెట్లు నరికివేత

పెద్దకొత్తపల్లి: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు టేకు చెట్లను నరికివేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన ఎత్తం హుస్సేన్‌కు లక్ష్మాపూర్ సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. ఈ పొలంలో టేకు చెట్లు పెంచుతున్నాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు టేకు చెట్లను నరికివేశారు. మంగళవారం ఉదయం పొలానికి రాగా చెట్లు నరికిఉండటంతో కన్నీటిపర్యంతం అయ్యాడు. రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు పేర్కొన్నాడు. బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఈగలపెంట ఎస్‌ఐగా జయన్న

దోమలపెంట: ఈగలపెంట ఎస్‌ఐగా కె.జయన్న బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన వీరమల్లు పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో జయన్న నియమించారు. జయన్న నాగర్ కర్నూల్ ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్నారు.

'మంత్రి వ్యాఖ్యలు సరికాదు'

కొల్లాపూర్: ఇళ్ల స్థలాలు కేటాయించాలని జర్నలిస్టులు చేపట్టిన నిరాహారదీక్ష మంగళవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్న జర్నలిస్టులు మాత్రమే దీక్ష చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. మంత్రి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం ఆర్డీఓ భన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. తాటికొండ కృష్ణ, రాంచందర్, జలకం మద్దిలేటి, ఎస్పీ మల్లికార్జున్, కురుమయ్య, సీపీ నాయుడు, కేశవులు, రమణ, స్వాములు తదితరులు ఉన్నారు.

రోడ్డును విస్తరించాలి

చారకొండ: మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని బీజేపీ మండల నాయకుడు చింతపల్లి కిరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా శిథిలావస్థకు చేరుకున్న పురాతన బ్రిడ్జిని తొలగించి నూతన బ్రిడ్జిని నిర్మించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు సబ్ సెంటర్‌లో మంగళవారం ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరం నిర్వహించారు.బీపీ, షుగర్, టీబీ, డెంగ్యూ, మలేరియా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెంట్లవెల్లి పీహెచ్‌సీ డాక్టర్ విజయ కుమార్, ఎంపీహెచ్‌ఓ సాయిరెడ్డి, ఆరోగ్య కార్యకర్త భాగ్యమ్మ, ప్రభాకర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కందనూలు: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కొల్లాపూర్ పట్టణానికి చెందిన సురేష్‌తో పాటు మరో 28మంది సభ్యులు ఎన్నికయ్యారు.

డీఈకి వినతి

నాగర్‌కర్నూల్: అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో తెలకపల్లికి చెందిన తుమ్మ చెన్నయ్య, తుమ్మ శివలు డీఈ శ్రీధర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. తెలకపల్లి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 497లో ఎలాంటి నిర్మించిన దుకాణాలలో కొందరు అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారని వివరించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా ఎంపికైన రాంచందర్‌రావును హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కొల్లాపూర్ బీజేపీ ఇన్‌చార్జ్ సుధాకర్‌రావు, మండల అధ్యక్షుడు పరుశురాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగరాజు, శేఖర్‌గౌడు, వెంకటస్వామి, బీమేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

పెద్దకొత్తపల్లి: గౌడ సంఘం ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ్మను మంగళవారం మంగళవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడు సంఘం నాయకులు ప్రసాద్‌గౌడు, రవీందర్‌గౌడు, పెద్ద శ్రీనుగౌడు, సురేందర్‌గౌడు, సత్యంగౌడు, వెంకటయ్యగౌడ్‌లు పాల్గొన్నారు.

మల్లేశ్వరం ఐలాండ్‌కు మోక్షమెప్పుడో?

- ప్రతి ఏటా పర్యాటకుల సందడి
- పట్టించుకోని పాలకులు, అధికారులు


కృష్ణానదిలో మధ్యలో ఉన్న పెద్దగట్టు ఐలాండ్

పెంట్లవెల్లి: మండలంలోని కృష్ణానది తీరాన ఉన్న మల్లేశ్వరంలో పెద్దగట్టు చుట్టూ నీరు ఉండడంతో ఐలాండ్‌లా తలపిస్తోంది. ఇది మల్లేశ్వరం ఐలాండ్‌గా ప్రసిద్ధిగాంచింది. ఎంతోమంది పర్యాటకులు ప్రతి సంవత్సరం మల్లేశ్వరంలో ఉన్న పల్లె అందాలను, నల్లమల్ల అడవులు, మధ్యలో ఉన్న ఐలాండ్‌ను పర్యాటకులు వచ్చి వీక్షిస్తుంటారు. మల్లేశ్వరం, మంచాలకట్ట, సోమశిల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున ఇంజన్ బోట్‌ల ద్వార అక్కడకు చేరుకొని కృష్ణానది అందాలను తిలకిస్తారు. అక్కడ ఆ గుట్టపై నుంచి చూస్తూ ఎటూ చూసినా కృష్ణానది సముద్రంలా తలపిస్తుంది. ప్రతి సంవత్సరం ఐదు నెలలపాటు పర్యాటకులు కృష్ణానదిని సందర్శిస్తుంటారు. పెద్దగట్టు ఐలాండ్‌ను పర్యాటక కేంద్రంగా చేయాలని మంత్రి, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోయారు. గత సంవత్సరం మంత్రి జూపల్లి కృష్ణారావు ఐలాండ్‌ను సందర్శించి కలెక్టర్‌కు, పర్యాటక శాఖ అధికారులకు ఐలాండ్‌ను పరిశీలించి సర్వే చేపట్టాలని ఆదేశాలిచ్చారు. దీంతో కలెక్టర్ బాదావత్ సంతోష్, పర్యాటక శాఖ అధికారులు పరిశీలించి సర్వే చేపట్టి పెద్దగట్టు మొత్తం 15 ఎకరాలు ఉన్నట్లుగా గుర్తించారు. కాని అప్పటి నుంచి ఇప్పటి వరకు దాని ఊసే లేకుండాపోయింది. ప్రతి సంవత్సరం నీళ్ళు వచ్చినప్పుడు మాత్రమే హడావుడి చేస్తారని తర్వాత పట్టించుకోరని విమర్శలు వినిపిస్తున్నాయి.

తీగల వంతెనకు ఆమోదం

ఐలాండ్‌కు అతి దగ్గర సమీపంలో ఐకాన్ తీగల వంతెనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని స్థానికులకు ఉపాధి దొరకే అవకాశం ఉంది. మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పెద్దగట్టు ఐలాండ్‌ను అభివృద్ధికి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెద్ద గట్టు సర్వే నిర్వహించాం

మంత్రి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ పెద్ద గట్టును సర్వే నిర్వహించి రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులకు నివేదిక ఇచ్చాం. త్వరలోనే దీనిపై మరోసారి వివరణ తీసుకొని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కల్వరాల నర్సింహ, పర్యాటక శాఖ అధికారి

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



పెద్దగట్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధికి సహకరించాలి. ఎన్నో ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారే కాని ఆచరణలో లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– బాలరాజు, మల్లేశ్వరం

కనీస వసతులు ఏర్పాటు చేయాలి



ప్రతి సంవత్సరం సోమశిల, మల్లేశ్వరం, మంచాలకట్టతో పాటు హైదరాబాద్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఐలాండ్‌ను చూడడానికి తరలి వస్తుంటారు. వారికి కనీస వసతులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– నర్సింహనాయుడు, మల్లేశ్వరం

ఉచితంగా ఈత మొక్కలు

బిజినేపల్లి: ఉచితంగా ఈత మొక్కలు ప్రభుత్వం అందజేస్తుందని అబ్కారీశాఖ ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ కథలప్పలు పేర్కొన్నారు. మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన రైతు వెంకటయ్య గౌడ్ వ్యవసాయంలో పొలంలో మంగళవారం వారు ఈత మొక్కలు నాటారు. ప్రభుత్వ స్థలాల్లో, బీడు పొలాల్లో కాల్వ కట్టలపై, చెరువు కట్టలపై, కుంట కట్టలపై ఈత మొక్కలను పెంచుకుని గౌడ కులస్తులు ఉపాధి పొందాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో టీఏలు శ్రీనివాసులు, కురుమూర్తి, కార్యదర్శి చంద్రశేఖర్‌పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బ్రిడ్జి నిర్మాణానికి సహకరించండి

అచ్చంపేట/దోమలపెంట: తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే మద్దిమడుగు–మాచర్ల మధ్య కృష్ణానదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం సహకరించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కోరారు. మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు వచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ను కలిసి వినతిపత్రం అందజేశారు. నల్లమలలోని మద్దిమడుగు పబ్బతి అంజనేయస్వామి ఆలయానికి ఏపీలోని మాచర్ల ప్రాంతాల నుంచి బోట్లలో కృష్ణానది దాటి వస్తుంటారని వివరించారు. బ్రిడ్జి ఏర్పాటుతో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంతో మాట్లాడి బ్రిడ్జి, జాతీయ రహదారి నిర్మాణంకు ఏపీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. అలాగే శ్రీశైలం దేవస్థానం బోర్డులో అచ్చంపేట ప్రాంతానికి సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. గంగాపురం రాజేందర్, మార్కెట్ చైర్మన్ రజిత మల్లేష్ పాల్గొన్నారు.

బీటీ పనులు నాణ్యతగా చేపట్టాలి

వెల్దండ: మండల కేంద్రం నుంచి రాచూర్ గ్రామం వరకు నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులను మంగళవారం పంచాయతీరాజ్ డీఈఈ బస్వలింగం పరిశీలించారు. రోడ్డు పనుల్లో భాగంగా సిమెంట్ పైపుల ఏర్పాటు, కల్వర్టు పనులను ఆయన పరిశీలించి నాణ్యతగా చేపట్టాలని సూచించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



బల్మూర్: చెంచుగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెంచుగూడెం ఆశ్రమ పాఠశాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం సందర్శించి విద్యార్థుల వసతి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం చేసి వంటలను పరిశీలించారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సంపంగి రమేష్, మాజీ సర్పంచ్‌లు ఎల్లికంటి శ్రీను, లింగమ్మ, బాలగౌడ్, హెచ్‌ఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటాలి



కల్వకుర్తిరూరల్: ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో మొక్కలు నాటాలని ఎంఈఓ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లికల్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ పేరుపై పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లలకు ఫోన్లు ఇవ్వొద్దని సూచించారు. చెడు వ్యసనాల బారిన పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జమీల్‌అహ్మద్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రెహానాబేగం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

కోడేరు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్‌ఐ హన్మంతు అన్నారు. మంగళవారం మండలంలోని మాచుపల్లిలో ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గుండ్ల చెరువు కట్ట కింద 700 ఈత మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. ప్రభుత్వం నిర్వహించే వనమహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, ఈసీ మోహన్‌కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున్, చెన్నయ్యగౌడ్, దస్తగిరి, మంజుల, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు వైఎస్సార్


నాగర్‌కర్నూల్‌లో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి


బిజినేపల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నాగర్‌కర్నూల్: ప్రజాసేవే పరమావధిగా జీవించిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేట్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజశేఖర రెడ్డి 108 ఆరోగ్య సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత కరెంటు, రైతు రుణమాఫీ, ప్రాజెక్టుల పేరు చెబితే వైఎస్ఆర్ గుర్తుకొస్తారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సంవిధాన్ మెంబర్ కోలన్ వల్లభ్ రెడ్డి, నాగర్ కర్నూలు జిల్లా మైనార్టీ అధ్యక్షులు హబీబ్, నాగర్ కర్నూల్ మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మన్ననూర్‌లో..

మన్ననూర్: దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన్ననూర్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజారాం, రవి బాలమ్మ, హన్మంత్‌రెడ్డి, సత్యనారాయణ, ఇస్మాయిల్, శివాజీ, రమేష్, కృష్ణయ్య, దేవేందర్, తిరుపతి, గోపాల్‌రెడ్డి, శంకర్, బిక్కు, సుక్య, లచ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణి విద్యానికేతన్‌లో...

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీవాణి విద్యానికేతన్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు పూలమాల వేసి నివాళి అర్పించారు. పేదలకు దుస్తులు, చిన్నారులకు నోట్‌పుస్తకాలు పంచారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూధన్‌రావు తోపాటు పలువురు ఉన్నారు.

పండ్లు బ్రెడు పంపిణీ

తాడూరు: మండల కేంద్రంలో వైఎస్సార్ జయంతిని సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పండ్లు, బ్రెడు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో జక్కులు, రాములు, బుచ్చయ్య, రమేష్, కృష్ణయ్య, చంద్రయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ అడుగుజాడల్లో నడుద్దాం

బిజినేపల్లి: వైఎస్సార్ అడుగుజాడల్లో నడుద్దామని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద వైఎస్సార్ జయంతి వేడుకలు కేక్ చేశారు. కత్తె ఈశ్వర్, గంగనమోని తిరుపతయ్య, మిద్దెరాములు, వాల్యానాయక్, రాంచందర్, గోవింద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు నివాళి

ఉప్పునుంతల: వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కట్టా అనంతరెడ్డి, నాయకులు గంగుల నర్సింహ్మారెడ్డి, మల్లయ్య, పాత్కుల రామచందయ్య, రేణయ్య, భాస్కర్, తిర్పతయ్యగౌడ్, కృష్ణ, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


మన్ననూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ


కొల్లాపూర్‌లో


ఉప్పునుంతలలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరా మహిళా శక్తి సంబురాలు


ఊర్కొండ రైతు వేదికలో ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో పాల్గొన్న అధికారులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. తాడూరు, కోడేరు, ఊర్కొండ, చారుకొండ, ఉప్పునుంతల, తెలకపల్లి మండలాల్లో మహిళ సంఘాలతో సమావేశాలు నిర్వహించారు. అధికారులు హాజరై మహిళా సంఘాల అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. తాడూరు అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి, ఏపీఎంలు బాల్‌చందర్, అనిల్, తిరుపతయ్య, శోభారాణి, ఊర్కొండలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఎం సంతోష్, కార్యదర్శి లక్ష్మీదేవి, కోశాధికారి లావణ్య ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ నరసింహ, కోడేరులో ఏపీఎం పార్వతమ్మ, ఉప్పునుంతల ఎంపీడీఓ మోహన్‌లాల్, తెలకపల్లి ఏపీఎం చంద్రయ్య, శ్రీనిధి మేనేజర్ నాగరాజు, చారకొండలో ఏపీఎం రాములు, మహిళా సంఘం అధ్యక్షులు, మహిళలు, సీసీలు, వీఓఏలు, వీఓఏలు పాల్గొన్నారు.

భర్తపై కేసు నమోదు

లింగాల: మండలంలోని బాకారం గ్రామానికి చెందిన ఎల్లికంటి విష్ణు మద్యానికి బానిసై తరుచుగా భార్య నిర్మలను వేధిస్తున్నాడు. మంగళవారం మద్యం తాగి భార్యను కర్రతో బలంగా కొట్టగా గాయాలయ్యాయి. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నైట్ హాల్ట్ బస్సు పునరుద్ధరణ

లింగాల: మండలంలోని అప్పాయపల్లికి నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించినట్లు అచ్చంపేట డీఎం శివ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేటలో రాత్రి 9 గంటలకు బస్సు బయలుదేరి లింగాల మీదుగా అప్పాయపల్లికి చేసుకుంటుందని, తిరుగు ప్రయాణంలో మరుసటి రోజు ఉదయం అప్పాయపల్లిలో 5 గంటలకు బయలుదేరి అచ్చంపేట చేరుకుంటుందని డీఎం తెలిపారు. ప్రయాణికుల సద్వినియోగం చేసుకొని సహకరించాలని కోరారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



వెల్దండ: మండల కేంద్రంలోని కబ్రస్తాన్ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు మసీద్ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 1, 2 ,719లో గ్రామ కంఠంలోని విస్తీర్ణం 4.20 గుంటల భూమిని ఆక్రమించేందుకు కొందరు చూస్తున్నారని వివరించారు. పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రషీద్, సాధిక్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన



కోడేరు: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన ఉంటుందని ఎంఈఓ భాస్కర్‌శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాయిపల్లి పీఎస్ పాఠశాల, బాడిగదిన్నె పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతుల వారిగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం బోధన ఉంటుందన్నారు. విద్య బోధనలో ఉపాధ్యాయులు మూస పద్ధతి వీడాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా ప్రారంభంలో పరీక్షలు నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సాయికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పనులు పరిశీలించిన టీఏ

కోడేరు: మండలంలోని సింగాయిపల్లిలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపడుతున్న పనులను టెక్నికల్ అసిస్టెంట్ స్వామి మంగళవారం పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా జీలుకుంట కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో 1000 మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, కూలీలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

ఉప్పునుంతల: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించి 31 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ సంఘం నాయకులు మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటయ్య, నిరంజన్, మల్లయ్య, శ్రీను, చిన్న వెంకటయ్య, సుధాకర్, బాలయ్య, మహేష్, బాలచంద్రయ్య, పరమేష్, స్వామి తదితరుల పాల్గొన్నారు.

ప్రజాసేవతోనే సంతృప్తి



కల్వకుర్తిరూరల్: ప్రజాసేవతోనే సంతృప్తి కలుగుతుందని ఐక్యత పౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఐక్యత పౌండేషన్ ఆధ్వర్యంలో కంటి శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజులుగా 3 వేల మంది శిబిరానికి హాజరయ్యారని, 2200 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 120 మందికి కంటి ఆపరేషన్ అవసరం అని గుర్తించినట్లు వివరించారు. 1400 మందికి కంటి అద్దాలను అందించామన్నారు. 28 మందికి కంటి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, యూసూఫ్‌బాబా, గణేష్, శ్రీపతి, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గొర్రెలు, మేకల సంత బహిరంగ వేలం

ఉప్పునుంతల: మండల పరిధిలోని శ్రీశైలం– హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన వెల్టూరు స్టేజీ సమీపంలో కొనసాగుతున్న గొర్రెలు, మేకల సంత 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను బహిరంగ వేలం నిర్వహిస్తునట్లు గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ మోహన్‌లాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న ఉదయం 11 గంటలకు వెల్టూరు గ్రామ పంచాయతీ ఆవరణలో వేలం పాట ప్రారంభమవుతుందని ఔత్సాహికులు గ్రామ పంచాయతీ పేరిట రూ. 20 వేలు డీడీ చెల్లించి దరఖాస్తుకు జతచేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రైతుబీమా చెక్కు అందజేత

పెద్దకొత్తపల్లి: చంద్రబండతండాకు చెందిన మహిళా రైతు బొజ్జమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు రైతు బీమా మంజూరైంది. మృతురాలి కుమారుడు లోకేషరాముడుకి మంగళవారం చెక్కును మాజీ సర్పంచ్ రాంలాల్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రవి, బాషానాయక్, ఆర్యానాయక్, గోబ్యానాయక్‌లు పాల్గొన్నారు.

నేటి సమ్మెకు ప్రజా సంఘాల మద్దతు


డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు

నాగర్‌కర్నూల్ రూరల్: సార్వత్రిక సమ్మెకు పూర్తిగా మద్దతు ఇస్తునట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా నాయకులు మల్లికార్జున్, కుర్మయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

చారకొండ: మండలంలోని జూపల్లిలో సమ్మెకు సంబంధించిన మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండపల్లి బాలస్వామి కరపత్రాలను విడుదల చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో తరలి విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షులు మధు, కార్మికులు రాములు, జంగయ్య, లింగయ్య, దేవేందర్, మల్లయ్య, రామస్వామి, తదితరులు ఉన్నారు.

డీటీఎఫ్ మద్దతు

ఉప్పునుంతల: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు డీటీఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు జక్క రామస్వామి, బి గోవర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మన్ననూర్: దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇస్తునట్లు పౌరహక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్క బాలయ్య, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ ఎద్దు అంబయ్య, కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర నాయకుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆత్మ నిర్భంద్ భారత్' పేరుతో 44 కార్మిక చట్టాలను నాలుగు విభాగాలుగా విభజించి కార్మికుల న్యాయపరమైన చట్టాలకు తూట్లు పొడవడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్మికులు, కర్షకులు, అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెలో భాగస్వాములు కావాలని కోరారు.